చివరికి దోమపోటు

- కోత దశలో దెబ్బతింటున్న పంట
- ఆందోళన చెందుతున్న రైతులు


సుడిదోమ ఉధృతితో దెబ్బతింటున్న వరి పంట

రేగొండ: వానకాలం సీజన్‌లో సాగు చేసిన వరి పంటను తెగుళ్ల వెంటాడుతున్నాయి. ముందస్తుగా సాగు చేసిన సన్న రకాలతో పాటు దొడ్డు రకం పంటకు కోత దశలో దోమ ఉధృతికి దెబ్బతింటోంది. దోమ ప్రభావంతో చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రేగొండ మండల వ్యాప్తంగా 7,550 ఎకరాలు, కొత్తపల్లిగోరి మండలంలో 5230 ఎకరాలలో వరి సాగయ్యింది. ఇందులో అత్యధికం సన్నరకాలే.. అయితే సన్నాలపై తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. ప్రధానంగా కోతకు వచ్చిన వరి పంటను సుడిదోమ చుట్టేస్తోంది. దీని ఉధృతి కారణంగా చేతికొచ్చిన పంట కళ్ల ముందు నాశనమవుతుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వరి పంటపై యూరియా వాడకం మోతాదుకు మించడంతో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో దోమ వృద్ధి చెందుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఉష్ణోగ్రతల్లో తేడాలు ఉండడం కారణంగా కూడా దోమ ప్రభావం ఎక్కువవుతోందంటున్నారు. దోమపోటు కారణంగా దిగుబడులు పడిపోతాయన్న ఆందోళన అన్నదాతల్లో వ్యక్తమవుతుంది.

నివారణ చర్యలు

- పొలంలో ఉన్న నీటిని పూర్తిగా తీసివేయాలి
- గాలి తగిలేలా పొలంలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి
- సుడిదోమ సముహాన్ని నియంత్రించేందుకు పసుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 10 నుంచి 12 ఏర్పాటు చేసుకోవాలి
- సుడిదోమ నివారణకు బుప్రోఫెజిన్ మందును ఎకరానికి 120 గ్రాములు లేదా డైనోటెఫ్యూరాన్ మందును ఎకరానికి 100 గ్రాముల మందును నీళ్లలో కలిపి పిచికారీ చేయాలి
- సుడిదోమ ఉధృతి అధికంగా ఉన్నట్‌లైతే పైమెట్రోజిన్–డైనోటెఫ్యూరాన్ 100 గ్రాముల మందును ఎకరానికి పిచికారీ చేయాలి.

క్లుప్తంగా

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత


ఫోన్లను అప్పగిస్తున్న పోలీసులు

పలిమెల: మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన లంగారి రాజు, పలిమెల గ్రామానికి చెందిన కుమ్మరి జంపయ్య 15 రోజుల క్రితం మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకొన్నారు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై జె.రమేశ్ ఆదేశాను మేరకు టెక్ టీం కానిస్టేబుల్ సంతోష్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ రికవరీ సి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఫోన్లను బాధితులకు ఎస్సై రమేశ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్ మాట్లాడుతూ.. మండలంలో ఎవరైనా వ్యక్తులు మొబైలు పోగొట్టుకున్నట్లయితే వెంటనే ఫిర్యాదు చేస్తే రికవరీ చేస్తామని తెలిపారు.

నియామకం



రేగొండ: మండలంలోని భాగిర్థిపేట గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా మెరుగు బాపన్న ఎన్నికయ్యారు. బుధవారం రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాస్, కార్యదర్శిగా బొనగాని తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా భిక్షపతి, తిరుపతి, రవి, రాజు, సదయ్య, మొగిళి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బాపన్న మాట్లాడుతూ.. గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

దుర్వినియోగం చేయొద్దు

కాళేశ్వరం: భారతదేశ పౌరులందరికి ఆర్‌టీఐ ఆక్టు 2005 ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఉపయోగించాలని, దుర్వినియోగం చేయొద్దని జిల్లా వ్యవసాయాధికారికి జాడి బాబురావు అన్నారు. బుధవారం ఆయన మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏడీఏ శ్రీపాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని, నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ సుప్రజ్యోతి పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

భూపాలపల్లి అర్బన్: కార్మికులు అనారోగ్య భారీన పడకుండా ఉండేందుకు ఆరోగ్య సూత్రాలు తప్పకుండా పాటించాలని సింగరేణి మెడికల్ అధికారి డాక్టర్ పద్మ సూచించారు. బుధవారం ఏరియాలోని కేటీకే 5వ గనిలో ఉద్యోగులకు గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మ మాట్లాడుతూ.. గుండె జబ్బులు రావడానికి కారణాలు వివరించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ రమేష్, వెల్ఫేర్ అధికారి సందీప్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు తిరుపతి, గట్టు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించొద్దు

కాళేశ్వరం: క్రైస్తవ మతంలోకి మారిన ఎస్సీ, బీసీ కులాల వారికి రిజర్వేషన్లు కల్పించొద్దని మహదేవపూర్ తహసీల్దార్ రామారావుకు నేతకాని రాష్ట్ర యువజన నాయకులు దుర్గం శ్రీనివాస్, బీసీ నాయకులు కారెంగుల శ్రీధర్, గడ్డం శ్రీనివాస్‌లు బుధవారం వినతిపత్రం అందజేశారు. మహదేవపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా కుల ధ్రువీకరణ పత్రాలతో రిజర్వు సీట్లలో ఎన్నికల్లో పోటీ చేయకుండా వారి కుల ధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

టికెట్ కోసం పూజలు

చిట్యాల: మండల కేంద్రంలో హనుమాన్ దేవాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతికి జెడ్పీటీసీ టికెట్ రావాలని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునే వారే నిజమైన నాయకులని, అలాంటి మంచి వ్యక్తి తిరుపతి అన్నారు. నాయకులు జన్నె నరేష్, బుర్ర మల్లేష్, మొలుగూరి కుమార్, గుర్రపు అశోక్ ఉన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

పలిమెల: మండల కేంద్రానికి చెందిన పడాల రమేశ్‌పై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కత్తితో దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు కలిసి బుధవారం సాయంత్రం అప్పాజీపేటలో మద్యం తాగారు. అనంతరం మాటామాటా పెరిగి కత్తితో రమేశ్ కడుపుపై దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై రమేశ్ ఘటన చేరుకొని అంబులెన్స్ రాకపోవడంతో ప్రైవేట్ వాహనంలో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. కాగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణ

- డీఎస్పీ సూర్యనారాయణ

కాటారం: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ సూర్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని గంగారం తండాలో పోలీసులు బుధవారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా సోదాలు నిర్వహించి అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్డెన్ సర్చ్‌లో భాగంగా 600 లీటర్ల జాగిరి వాష్, 60 లీటర్ల గుడుంబా స్వాధీనపర్చుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్ లేని 17బైక్‌లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో గుడుంబా తయారీకి పాల్పడితే ఊరుకునేది లేదన్నారు. యువత మత్తు పదార్థాలు, గంజాయి లాంటి వాటికి దూరంగా ఉండాలని గ్రామంలో గుడుంబా కట్టడికి నడుం కట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జునరావు, మహాముత్తారం ఎస్సై మహేందర్, ఎస్సై–2 రాజశేఖర్, ఎస్సై–3 మానస, టిజిఎస్పీ, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

నిలిపి ఉన్న లారీల్లో డీజిల్, టైర్లు చోరీ


టైర్లు చోరీకి గురైన లారీ

మల్హర్: మండలంలోని కొయ్యూరు పరిధిలో మూసియున్న పెట్రోల్ పంపులో నిలిపి ఉన్న లారీలో లారీకి బిగించి ఉన్న నాలుగు టైర్లు, స్టెఫిన్ టైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు లారీ యాజమాని శ్రామణ్‌రావు బుధవారం తెలిపారు. లారీకు సపోర్ట్‌గా రెండు బండారాళ్లు పెట్టి ట్రైర్లతో పాటు బ్యాటరీస్, 120 లీటర్ డీజిల్, జాకీ ఎతుకెళ్లినట్లు చెప్పారు. వారం రోజుల క్రితం రెండు లారీలలో దాదాపుగా 500 లీటర్ల డీజిల్ దొంగతనం జరిగిందని రెండు సంఘటనలలో కొయ్యూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

- సీడీపీఓ రాధిక


సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది

కాటారం: అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక తెలిపారు. కాటారం మండలం అంకుశాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకమాసం కార్యక్రమం నిర్వహించారు. చిరు ధాన్యాలు, ఆకుకూరలతో తయారు చేసిన పోషకాహార పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగి ఉన్న చిరు ధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు లాంటి వాటిని ఆహారంగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు షాహెదా బేగం, శ్రీలత, హైమావతి, పుష్పలత, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

చెరువు కట్టకు మట్టి పోయాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల ఉరచెరవు కట్టపై మట్టి పోయాలని తాడిచర్ల ఏఎమ్మార్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకరెడ్డికి నిర్వాసితులు బుధవారం వినతిపత్రం అందించారు. ఉర చెరువు కట్టకు ఇరు వైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించి, మట్టి వేసి కట్టను సరి చేయాలని కోరారు. తాడిచర్ల ఎస్సీ కాలనీలో పోచమ్మ గుడికి ఉన్న రోడ్డుకు మట్టి పోయాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు కేసారపు చంద్రయ్య, ఇందారపు చంద్రయ్య, అశోక్‌రావు, రమేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటాలి


ఎస్ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న కల్యాణి


గోవిందరావుపేటలో..

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి

ఎస్ఎస్‌తాడ్వాయి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేసి సత్తాచాటాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామాలాభివృద్ధి కోసం మంత్రి సీతక్క ఎంతోగాను కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బొల్లు రమేష్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, జాతర చైర్మన్ లచ్చుపటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాంబయ్య, మండల ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రాంబాబు, నాయకులు బండారి చంద్రయ్య, రాజీరెడ్డి, రాజశ్రీ, పాయం కవిత పాల్గొన్నారు.

గోవిందరావుపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత సత్తా చాటాలి అని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాకేశ్ అన్నారు. మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింత క్రాంతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ.. సీతక్కపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి, పెండెం శ్రీకాంత్, గొంది కిరణ్, కోరం రామ్మోహన్, జక్కు రణదీప్ గౌడ్, పొన్నం సాయి, కొల్లు శ్రీనివాస్ రెడ్డి, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

‘స్థాయిని మించి మాట్లాడడం సరికాదు’


మాట్లాడుతున్న మహేందర్

రేగొండ: కాంగ్రెస్ నాయకులు స్థాయిని మించి మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి గురించి అనుచితంగా మాట్లాడడం సరికాదని బీఆర్ఎస్ నాయకుడు మహేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. అధికారం ఎకరికీ శాశ్వతం కాదని గ్రహించాలని, ప్రతిపక్షాలు విమర్శిస్తే స్వీకరించి, మరింత మెరుగ్గా పని చేసి చూపించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రాహిల్

వాజేడు: చర్మ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరూరు వైద్యాధికారి రాహిల్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో బుధవారం పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాహిల్ వైద్య శిబిరం నిర్వహిచారు. జ్వరంతో బాధపడుతున్న 10 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేశారు. వైరల్ ఫీవర్ కావడంతో ఎలాంటి ప్రమాదం లేదని సూచించారు. కాలానుగుణంగ వచ్చే వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ తదితరులు ఉన్నారు.

అధ్యక్షురాలిగా మమత


నియామక పత్రం అందిస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): మండలంలోని జవహర్‌నగర్ గ్రామానికి చెందిన రుద్రారపు మమత మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. బుధవారం మండల కేంద్రంలో ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి అయిలయ్య, నాయకులు మామిడిశెట్టి కోటి, అల్లాడి రాజేశ్వర్‌రావు, జంగిలి రవి, చీకూర్తి రమేష్, చెన్నోజు శ్రీనివాస్, కూరెళ్ల రామాచారి, కొంపెల్లి రాజిరెడ్డి, జాకీర్, వెంకటేష్, మొగిలి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

- ఏఓ కల్యాణి


యూరియాను అందిస్తున్న ఏఓ కల్యాణి

టేకుమట్ల: మండల రైతులకు యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి కల్యాణి అన్నారు. బుదవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలలోని యూరియా నిల్వలను ఆమె పరిశీలించి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలకు రైతులకు సరిపడా యూరియా లభిస్తుందని, ఇప్పటి వరకు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ద్వారా 780, ప్రైవేటు డీలర్ల ద్వారా 650 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే నానో యూరియా 850లీటర్లను సరఫరా చేసినట్లు తెలిపారు. మండలంలోని టేకుమట్ల, పంగిడిపల్లి, బూర్నపల్లి, యూరియా కావాల్సిన రైతులు ఆధార్, పట్టాపాస్‌బుక్ తీసుకుని యూరియా పొందలన్నారు. ఆమె వెంట ఏఈఓ రాహుల్, రైతులు, ఆగ్రోస్ నిర్వాహకులు ఉన్నారు.

కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ


టేకుమట్ల: బాకీ కార్డులను పంచుతున్న నాయకులు


మల్హర్‌లో..

టేకుమట్ల: మండలంలోని అంకుషాపూర్‌లో బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించి అధికారం చేపట్టిందన్నారు. 20 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజల మధ్యకు తీసుకెళ్తుంటే ధోకా కార్డుల పేరుతో కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి రావడం వెనక అంతర్యమేంటని ప్రశ్నించారు. పెంచుతామన్న పెన్షన్లు, రైతు భరోసా, కల్యాణలక్ష్మీ పథకంలో బంగారం, స్కూటీలను పూర్తిగా విస్మరించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, బండెల నరేష్, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ బాకీ కార్డులను అందజేసి ప్రచారం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షుడు జాగరీ హరీష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావు, నాయకులు కోట రవి, మధుసూదన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


కాటారం: పరామర్శిస్తున్న పుట్ట మధు


రేగొండలో..

కాటారం: మండలంలోని దామెరకుంటకు చెందిన జిల్లెల పెద్దలింగయ్య, విలాసాగర్‌లో రొడ్డవేన లక్ష్మి, దేవరాంపల్లిలో రాజమల్లక్క ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పరామర్శించారు. పుట్ట మధు వెంట మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, బాసాని రవి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రేగొండ: మండల కేంద్రానికి చెందిన బండి కమలమ్మ బుధవారం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్ రెడ్డి పరామర్శించి, మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి పెండల రాజు, నాయకులు బుచ్చిరెడ్డి, మల్లేష్, శివకృష్ణ, శంకర్, రవీందర్ ఉన్నారు.

అక్రమంగా మొరం దందా!


శాంతినగర్ గుట్టల నుంచి తరలిస్తున్న మట్టి

చిట్యాల: మండలంలోని నవాబుపేట శివారులోని శాంతినగర్ గుట్టల నుంచి అక్రమంగా మొరం తొవ్వకాలు కొనసాగుతోన్నాయి. మంగళవారం అర్ధ రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు రాత్రి పగలు అనే తేడా లేకుండా మొరం తవ్వాకాలు నిర్వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. సహజ సిద్ధంగా ఏర్పడిన గుట్టలను నుంచి కొంత మంది అక్రమ సంపాదనే ధ్యేయంగా పని చేస్తూ మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, మైనింగ్ అధికారులు స్పందించి అక్రమంగా మొరం తవ్వాకాలు చేపట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

- ఎస్సై పరమేశ్

శాయంపేట : సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జక్కుల పరమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సురేఖ మండల సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఎస్సై పరమేశ్ హాజరై మాట్లాడారు. ప్రస్తుత కాలంలో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయని అన్నారు. బహుమతులు గెలుచుకున్నారని, మీ సంబంధికులు పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని, మీ వాళ్లకు ప్రమాదం జరిగిందని అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలు స్మార్ట్ ఫోన్ వినియోగించే విధానాన్ని గమనించి తగిన జాగ్రత్తలు చెప్పాలని అన్నారు. పిల్లలు మనీ యాప్ జోలికి వెళ్లకుండా వాటి ద్వారా వచ్చే నష్టాలను తెలియజేయాలన్నారు. సైబర్ నేరాల ద్వారా మోసపోయామని గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ విడ్స్ కౌన్సిలర్ మారెపల్లి క్రాంతికుమార్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.